క్లుప్తంగా

అధ్వాన రహదారితో అవస్థలు



భారీ గుంతలతో ఫార్మాసిటీ రహదారి

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలో పలు రహదారులు అధ్వానంగా మారడంతో పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఫార్మాసిటీలోని గ్యాన్యుల్స్ పరిశ్రమ ఎదుట నిర్మించిన రహదారిలో ఏర్పడిన భారీ గుంత ఉద్యోగులు, కార్మికులను నిత్యం ప్రమాదాలకు గురిచేస్తోంది. ఏమాత్రం వర్షం పడినా, ఈ భారీ గోతిలో నీరు చేరి చిన్న చెరువును తలపిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంగా గోతులను పూడ్చడానికి రాంకీ యాజమాన్యం కనీస చర్యలు తీసుకోవలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రివేళ పరిశ్రమల్లో విధులు ముగించుకుని ఇళ్లకు చేరే క్రమంలో ఈ గుంతను దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి రోడ్డు మధ్యలో ఉన్న ఈ భారీ గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరం

పరవాడ: విశాఖ స్టీల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విశాఖ కంటి ఆస్పత్రి సౌజన్యంతో తానాం రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధి మంత్రి జగన్నాథరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 1,100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపి, అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తామన్నారు.

పుస్తెల తాడు తెంచుకుపోయిన నిందితుల అరెస్ట్

సబ్బవరం: మండలంలోని బాటజంగాలపాలెంలో ద్విచక్రవాహనంపై వెళ్తూ మహిళ మెడలో పుస్తెల తాడును తెంచుకుపోయిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులు ఒడిశాలోని కోరాపుట్ జిల్లా జైపూర్‌కు చెందిన కోరాడ సూర్యరావు, కోరాడ కుమార్‌లుగా పేర్కొన్నారు. బాటజంగాలపాలేనికి చెందిన బోశం నాగలక్ష్మి బుధవారం సాయంత్రం జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్డులో గంటెలు నూర్పుతోంది. అదే సమయంలో అనకాపల్లి నుంచి సబ్బవరం వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న ఈ ఇద్దరు నిందితులు ఆమె మెడలోని సుమారు రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుల్ని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల్ని కాపాడే బాధ్యత లేదా?

- ఐదెకరాల భూమి కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకుంటారా?
- చింతగట్లలో టీడీపీ నాయకులపై మరో వర్గం టీడీపీ నాయకుల ఫైర్



మాట్లాడుతున్న గనిశెట్టి కనకరాజు, చిత్రంలో ఎంపీటీసీ అప్పలరాజు, సంతోష్

పెందుర్తి: 'మన గ్రామంలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. మేము దానిపై పోరాటం చేస్తున్నాం. ఆ భూమిని కాపాడాలని మా బాధ్యతగా ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాం. అలా చేశామని మాపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ఆ భూమిని మీరు కాపాడాలనుకుంటున్నారా.. లేక కబ్జా చేస్తున్న వారికి మద్దతు పలుకుతున్నారా'అంటూ చింతగట్లకు చెందిన టీడీపీ నాయకులు తమ పార్టీకే చెందిన ప్రత్యర్థి వర్గం నాయకులపై విరుచుకుపడ్డారు. ఆదివారం గ్రామంలో జరిగిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నేత, అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు మాట్లాడుతూ సర్వే నెం.81/2లో సుమారు రూ.25 కోట్లు విలువ చేసే ఐదెకరాల భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దాన్ని అడ్డుకునేందుకు ఆధారాలతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇది గిట్టని స్థానిక టీడీపీ నాయకుడు చిన్నారావు, ఇతర టీడీపీ నాయకులు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు మాట్లాడుతూ ఐదెకరాల భూమిని కాపాడేందుకు చిన్నారావు, ఇతర నాయకులు కనీసం ఒక్క ఫిర్యాదు అయినా చేశారా? అని ప్రశ్నించారు. స్థానిక నాయకుడు బొట్టా సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కాపాడుతున్న తమపై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆరోగ్య రక్ష



వాడచీపురుపల్లి పీహెచ్‌సీలో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు



నాయుడుపాలెంలో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

వర్షాలతో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానం

అవగాహన పెంచుతున్న పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు

అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ నీరు నిలిచి దోమల వ్యాప్తి పెరుగుతోంది. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పరవాడ మండలంలోని పరవాడ, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, గొర్లివానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, నాయుడుపాలెం, ఇస్సన్నపేట, నడింపల్లి, నర్సాపురం తదితర గ్రామాల్లో ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు తదితర సమస్యలతో పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

పరవాడ: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోగాలు విజృంభిస్తున్నాయి. మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంను తొలగించక పోవడంతోపాటు వాతావరణ మార్పులతో చిన్నాపెద్దా అనే తేడా లేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. జలుబు, జ్వరం, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, కామెర్లు, చికున్‌గున్యా, డయేరియా వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు–లక్షణాలు

- కలుషిత నీరు, కలుషిత ఆహారంతో సాల్మోనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా టైఫాయిడ్ వ్యాపిస్తుంది. దీంతో వదలకుండా 103, 104 డిగ్రీల జ్వరం, వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి లక్షణాలుంటాయి.
- పగటి పూట దాడి చేసే ఏడెస్ ఈజిప్టి దోమల వల్ల డెంగ్యూ వ్యాప్తిస్తుంది. ఈ దోమ కుట్టిన వారం రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన తల నొప్పి, వణుకుతో జ్వరం, ఒళ్లు, కీళ్లు, కండరాల నొప్పులు, నోరు చేదుగా ఉండడం, ఆకలి మందగించడం, ఛాతీపై ఎర్రటి మచ్చలు, జ్వరం తీవ్ర స్థాయికి చేరితే రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడడం వల్ల మలేరియా వ్యాధి సంక్రమిస్తుంది. జ్వరం వస్తూ పోతూ ఉంటుంది. కడుపులో అసౌకర్యంగా ఉండడం, చలితో వణుకు కొంత సేపటికి చెమటలు పట్టడడం వంటి లక్షణాలుంటాయి.
- బ్యాక్టీరియా, పరాన్న జీవుల ఇన్‌ఫెక్షన్ మూలంగా నీళ్ల విరేచనాలు వస్తాయి. రోజుకు మూడు అంతకన్నా ఎక్కువ విరేచనాలవుతుంటే డయేరియాగా గుర్తించాలి. ఈ వ్యాధి వలన ఒంట్లో ఉండే నీళ్ల శాతం తగ్గిపోయి, డీహైడ్రేషన్‌కు దారి తీసే ప్రమాదం ఉంది.
- ఎడీస్ దోమ ద్వారా చికున్ గున్యా వ్యాధి ప్రబలే అవకాశాలున్నాయి. అప్పటికప్పుడే తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

పరిశుభ్రతే ప్రధానం

ప్రజలు తాము నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు సీజనల్ రోగాల నుంచి తప్పించుకోవచ్చు. ఇంటి పరిసరాల్లో నీటి తొట్టెలు, మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. నిల్వ నీటిని పారబోయాలి. ఫ్రిజ్‌లు, కూలర్లు, బయట పడేసిన కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఇళ్లలో దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడుకోవాలి. వేడి చేసి, వడకట్టిన నీటిని తాగడం మంచిది.

పీహెచ్‌సీల్లో నగటు ఓపీలు, జ్వరపీడితులు		
పీహెచ్‌సీ	ఓపీ	జ్వరపీడితులు
పరవాడ	80	20
వాడచీపురుపల్లి	95	25



వాడచీపురుపల్లి పీహెచ్‌సీలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు



వెన్నలపాలెంలో మురుగు కాలువను శుభ్రం చేయిస్తున్న పంచాయతీ అధికారులు

4 రోజుల నుంచి జ్వరం



నాలుగు రోజుల నుంచి జ్వరం వస్తోంది. ఒళ్లు నొప్పులు, కాళ్లుచేతులు పీకుడు, చాలా నీరసంగా ఉంటోంది. నాలాగే మా ఊర్లో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరం తరచూ రావడంతో ఆస్పత్రికి వచ్చాను. వైద్యులు పరీక్షలు జరిపి సాధారణ జ్వరమేనని చెప్పి మందులిచ్చారు.

– పైల పోలమ్మ, పరవాడ

వైరల్ ఫీవర్ అన్నారు



ఆగిఆగి జ్వరం వస్తుండటంతో ఆస్పత్రికి వచ్చాను. వైద్యులు రక్త పరీక్షలు జరిపి వైరల్ ఫీవర్ అని చెప్పారు. భయపడనవసరం లేదు.. మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. వేడి నీరు తాగాలన్నారు. మందులు క్రమం తప్పకుండా వాడితే ఫీవర్ తగ్గిపోతుందని వైద్యులు సూచించారు.

– రెడ్డి శంకర్, నడింపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



తాజా వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామీణ ప్రజలకు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఆస్పత్రిలో రక్త పరీక్షల కిట్లు సిద్ధంగా ఉంచాం. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

– వి.కనక అప్పారావు, ప్రభుత్వ వైద్యుడు, వాడచీపురుపల్లి

ఘనంగా జిల్లా స్థాయి యోగాసన పోటీలు



యోగా పోటీల్లో ఆసనాలు చేస్తున్న విద్యార్థులు

పరవాడ: అనకాపల్లి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెన్నలపాలెం బండారు అప్పలనాయుడు కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోజసన పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో అనకాపల్లి జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు ట్రెడిషినల్, ఆర్టిస్టిక్, రిథమిక్, ఇండివిడ్యువల్ ఈవెంట్స్‌లో పోటీపడ్డారు. విజేతలు ఆగస్టులో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, రవిశంకర్ తెలిపారు. పురుషుల విభాగంలో వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థి ఎస్.అభిరామ్, బాలికల విభాగంలో తానాం గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.వైష్ణవి చాంపియన్‌షిప్ సాధించారు.. విజేతలకు పరవాడ హైస్కూల్ హెచ్ఎం బి.అప్పలనాయుడు, నాయకులు బహుమతులు అందించారు.

ముగిసిన సబ్బవరం డిగ్రీ కళాశాల ఆడిట్



సీతాలక్ష్మిని అభినందిస్తున్న ఆర్జేడీ కృష్ణాజీ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఉపకార వేతనాలు, సీడీసీ నిధులు, కళాశాల విద్యాశాఖ నిధులు, ప్రభుత్వ రంగ సంస్థల సీఎస్సార్ నిధులు తదితర అంశాలపై నిర్వహించిన ఆడిట్‌పై ఆర్జేడీ డాక్టర్ పీవీ కృష్ణాజీ ఆదివారం సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి.సీతాలక్ష్మి ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2021 నుంచి జూలై 2025 మధ్య కాలానికి ఆడిట్ నిర్వహించడంతో, అన్ని రకాల పద్దులు సక్రమంగా వినియోగించినట్లు తేల్చారు. రాజమండ్రి కళాశాలకు చెందిన ఆర్జేడీతోపాటు, ఆయన కార్యాలయ సిబ్బంది సుబ్రహ్మణ్యం, ఎస్.సుధీర్, వి.సంతోష్‌కుమార్, ఎ.దుర్గాప్రసాద్ తదితరులు ఈ నెల 23 నుంచి 26 వరకు ఈ ఆడిట్ నిర్వహించారు.

పోలీసులకైతే వద్దు.. 'కూటమి'కైతే ముద్దు!

- పురుషోత్తపురం జెడ్పీ స్థలంలో పోలీస్ రికవరీ వాహనాల పార్కింగ్
- తక్షణమే ఖాళీ చేయాలని దేవస్థానం అధికారుల హుకుం
- అదే స్థలంలో ఇసుక స్టాక్ పాయింట్‌లు నడుపుతున్న కూటమి నేతలు
- కన్నెత్తి చూడని దేవస్థానం యంత్రాంగం



పురుషోత్తపురంలోని జెడ్పీ(దేవస్థానంతో వివాదం ఉన్న) స్థలంలో వాహనాలు పెట్టిన పోలీసులు



కూటమి నాయకుల అండతో అదే స్థలంలో అనధికారిక ఇసుక పాయింట్‌లు, ప్రైవేట్ వాహనాల పార్కింగ్

పెందుర్తి: సింహచలం దేవస్థానం అధికారుల ద్వంద్వ నీతి చర్చనీయాంశమవుతోంది. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని ఓ వివాదాస్పద స్థలంలో దేవస్థానం భూ పరిరక్షణ అధికారుల తీరే ఇందుకు కారణం. పోలీసుల వాహనాల పార్కింగ్‌ను ఖాళీ చేయించేందుకు తక్షణమే రంగంలోకి దిగిన వారికి కొన్నాళ్లుగా అదే స్థలంలో కూటమి నాయకుల అండతో నిర్వహిస్తున్న అనధికారిక ఇసుక స్టాక్ పాయింట్లు మాత్రం కనిపించకపోవడం గమనార్హం.

కూటమి వారికైతే ఓకే

పురుషోత్తపురం బీఆర్‌టీఎస్ రహదారికి అతి సమీపంలో సర్వే నెం.12/9లో జిల్లా పరిషత్ సారథ్యంలోని మండల పరిషత్‌కు చెందిన స్థలం ఉంది. అదే సర్వే నెంబర్‌లో దేవస్థానానికి సంబంధించిన స్థలం కూడా ఉంది. దాదాపు రెండెకరాల స్థలంపై దేవస్థానం, జెడ్పీ మధ్య హద్దుల విషయంలో వివాదం నడుస్తోంది. వాస్తవానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తే ఒక్కరోజులో తేలిపోయే వ్యవహారం. వివాదాల కారణంగా ఆ స్థలం దశాబ్దాలుగా ఖాళీగా ఉంది. స్థానిక కూటమి నాయకుల అండతో ఇసుక వ్యాపారులు రీచ్‌ల నుంచి ఇసుకను ఇక్కడకు తీసుకువచ్చి, అనధికారికంగా స్టాక్ చేసుకుని అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ విషయంలో దేవస్థానం సిబ్బంది తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలీసులకు మాత్రం నో..

పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు ప్రమాదాలు, గంజాయి, ఇతర కేసుల్లో రికవరీ చేసిన వాహనాల తాకిడి పెరిగింది. ఈ క్రమంలో స్టేషన్ వద్ద స్థలం సరిపోకపోవడంతో ప్రత్యామ్నాయంగా పురుషోత్తపురంలోని జెడ్పీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల చాలా వాహనాలు అక్కడికి తరలించి భద్రపరిచారు. అయితే విషయం తెలుసుకున్న దేవస్థానం అధికారులు వాటిని తక్షణమే అక్కడి నుంచి తరలించాలని పోలీసు అధికారులకు సూచించడంతో అంతా నివ్వెర పోయారు. వివాదం ఉన్నప్పటికీ కేవలం పార్కింగ్ కోసమే ఇక్కడ వాహనాలు పెడుతున్నాం తప్ప శాశ్వతం కాదని చెప్పినా ఊరుకోలేదు. చివరకు పోలీస్ ఉన్నతాధికారులు చొరవ తీసుకోవడంతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది. అదే సమయంలో పక్కనే ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌లు, పార్కింగ్ చేసిన ఇతర ప్రైవేట్ వాహనాల జోలికి మాత్రం దేవస్థానం అధికారులు వెళ్లకపోవడం కొసమెరుపు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టంలో అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వాహన చోరులతో తస్మాత్ జాగ్రత్త!



సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలు

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ వాహనాలను ఎక్కడిపడితే అక్కడ పార్క్ చేసి విధులకు వెళ్లిపోతున్నారు. తిరిగి వచ్చి చూసే సరికి వాహనాలు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక భాగంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను పార్క్ చేసి విధులకు వెళ్తుంటారు. ఎన్టీపీసీ వద్ద కూడా పార్కింగ్ స్థలం చాలినంత లేకపోవడంతో చెట్ల నీడన వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఇదే అదనుగా చేసుకుని వాహన చోరులు వాటిని దొంగిలిస్తున్నారు. మెకానిక్ షెడ్ల వద్ద కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల సినిమాహాలు కూడలి వద్ద ఓ మెకానిక్ షెడ్‌కు రిపేర్ కోసం ఇచ్చిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకుపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో షెడ్ యజమాని రూ.50 వేలు చెల్లించుకోవాల్సి వచ్చింది. దీనిపై స్థానిక సీఐ మల్లికార్జునరావును వివరణ కోరగా.. పరవాడ ప్రాంతంలో వాహన చోరీలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగైదు నెలలుగా వాహన చోరీలు తగ్గుముఖం పట్టాయన్నారు. భద్రత లేని ప్రదేశాల్లో వాహనాలను నిలపడం శ్రేయస్కరం కాదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద స్థలిలో రామిరెడ్డి మృతదేహం ఇన్‌సెట్‌లో మృతుడు రామిరెడ్డి(ఫైల్)

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీ దరితానాం జంక్షన్ ఫైర్ స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా మహమ్మద్‌పురం గ్రామానికి చెందిన కొండపురెడ్డి రామిరెడ్డి(39) మృతి చెందాడు. మృతుడు కూర్మన్నపాలెంలో నివాసం ఉంటూ ఫార్మాసిటీలోని ఓ ప్రైవేట్ కంపెనీలో నాలుగేళ్ల నుంచి పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లయింది. పిల్లలు లేరు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌పై వేగంగా కూర్మన్నపాలెం వెళ్తున్న క్రమంలో బైక్ స్కిడ్ అయి డివైడర్‌ను దాటుకుని విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో రామిరెడ్డి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతివేగమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నామని సీఐ మల్లికార్జునరావు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎన్టీపీసీ పైప్‌లైన్ల లీకేజీలు



తిక్కవానిపాలెం రహదారిలో లీకవుతున్న ఎన్టీపీసీ పైప్‌లైన్

పరవాడ: ఎన్టీపీసీ–తిక్కవానిపాలెం రహదారిలో ఎన్టీపీసీ సీ వాటర్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఎన్టీపీసీ నుంచి విడుదలయ్యే వేడినీటిని సముద్రంలోకి పంపే పైపునకు రంధ్రం పడి నీరంతా ఉప్పుటేరులో కలుస్తోంది. దీన్ని పూడ్చేందుకు కనీస చర్యలు చేపట్టలేదు. అలాగే ఈ రహదారిలో వంతెన వద్ద కూడా పైప్‌లైన్ లీకై నీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. నెలల తరబడి ఈ లీకేజీలను అలానే వదిలేయడంతో రోడ్డు నాచుకట్టి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ లీకేజీల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సచివాలయ బదిలీ సిబ్బందికి ఘన సత్కారం



బదిలీ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధి సచివాలయంలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రవి, వీఆర్వో పీవీ ఎస్ఎస్ మూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ వి.మహాలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.శ్రావణి, ఏఎన్ఎం సీహెచ్ దేవకిలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఎంపీటీసీ చొక్కాకుల గోవింద్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు తదితరులు మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ దేముడు, వార్డు మెంబర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!



బురదమయంగా బొట్టవానిపాలెం–ఎన్టీపీసీ రహదారి

పరవాడ: రావాడ శివారు బొట్టవానిపాలెం గ్రామానికి అనువైన రహదారి సౌకర్యం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బొట్టవానిపాలెం పరిసర గ్రామాల ప్రజలు రావాడ, ధర్మారాయుడుపేట తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. ఎన్టీపీసీలో పనిచేసే కార్మికులు, వాడచీపురుపల్లిలోని బ్యాంకు పనులపై వెళ్లే ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం పడితే చాలు రహదారి మొత్తం బురదగా మారి, రాకపోకలు సాగించాలంటే నానా ఇబ్బందులు పడాలి. శివారు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని అనేక పర్యాయాలు మొరపెట్టుకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి బొట్టవాని పాలెం–ఎన్టీపీసీ వరకు పక్కా రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.